

# ఊకదంపు

''వాడు వూకదంపు రచిస్తాడు. దంచటం గూడా అదే. నువ్వు గమనించావో లేదో! కొంతమంది రాజకీయాల్లో దూరినవాళ్లా అదే చేస్తారు. సారాంశముండదు'' అన్నాడు నరహరి.

''నీకు జెలసీ వున్నది. అదలా అనమంటుంది. యేది రచించినా ప్రైజు కొడ్తున్నాడు. వాడి పుస్తకాలు బెస్ట్ సెల్లర్స్ అని పబ్లిషరు కితాబిచ్చాడు. వాటిని అమ్ముతూ తక్కినవీ వదిలించుకుంటున్నానంటాడు. నీవన్న దాంట్లో స్వారస్యమేదీ?'' అన్నాడు మురారి.

''యేవో లింక్సు వుంటాయి. స్ట్రింగ్సూ, ఆబ్లిగేషన్సూ ప్రైజ్ ఇవ్వమని సిఫారస్ చేస్తాయి. పాయింటేమిటో కథ యెటుపోతున్నదో యెవరి మీద నడుస్తున్నదో తేల్చకపోయినా ప్రైజు తెచ్చిస్తాయి. మిత్రమా! ఒక గొప్ప రచయితే యేపుట కాపుట సహజంగా వుంటే చాలన్నాడు. ఆరూ యేడూ శతాబ్దిలో మత గురువులు ఒక్క చక్రం మీద బైబిల్ లోని మాటలు వ్రాసి గిర్రున హేండిల్లో తిప్పితే అది అన్నిసార్లు జపించినట్లేననేవారుట. ప్రపంచ సుందరియెలా అయిందీ చెప్తూ ఒక పెద్దమనిషి కొన్ని బైటపెట్టాడు. సారస్వతమూ ఆ కోవలోనిదే''.

'' ఒకటన్నా ప్రూవ్ చేయాలి. లేకపోతే నీదీ వూకదంపే''.

'' ఒక గొప్ప సమర్థుడు పత్రిక స్థాపించి విజయవంతంగా సర్క్యులేషన్ పెంచుతూ, 'తెలివైన ప్రశ్నకు నూరు రూపాయలు బహుమానం' అని పెట్టి

ప్రశ్నావళి టైటిల్తో నడిపాడు. ప్రశ్నలూ, జవాబులూ, ప్రైజు చదివిన ఒక మేధావి ' ఆ ప్రశ్న చచ్చు ప్రశ్న. తెలివిగా వేశాడా? బహుమానమివ్వ తగ్గదా?' అని ప్రశ్నావళికి పంపాడు.

''యేం చేసి ప్రైజు కొట్టాడో వాడినే అడగరాదూ మిత్రమా! వాడు దెప్పటం లేదు. తిట్టటం లేదు' అనే జవాబు పత్రికలోనే యిచ్చాడు పత్రికాధిపతి''.

తలొంచుకుని వింటున్న మురారి తలపైకెత్తి, కళ్లజోడులోంచి చూస్తూ అన్నాడు. ''వాడి కందనిదీ, యిష్టమైనదీ నిషాయిచ్చేదీ విదేశీదీ అందించాడేమో పృచ్ఛకుడు!''.

''చూశావా! నీకే తెలిసిపోయింది. అన్ని ప్రైజులూ అంతే నందాము. వూక'' అంటూ లేచాడు నరహరి.

''హలో చంద్రశేఖరం మాటల్లో వచ్చావే! నీకు నూరేళ్లాయుష్షు, నీ దర్శనం లేక కాలం గడవక, బావగారెటు వెళ్లారోనని ఆలోచిస్తున్నాను. ఇలా వచ్చి యీ చిరి చాప మీద కూచోండి. కాళ్లకు నీళ్లివ్వనా? చల్లగాలికి వరండాలో కబుర్లాడుతూ కూచున్నాం. యేమిటి విశేషాలు వూర్నించి వచ్చినట్టున్నారు?'' నరహరి మర్యాద చేసి చల్లని కొబ్బరి నీటి గ్లాసు ముందుంచాడు.

ఆదరగౌరవాలకీ ఆప్యాయతకీ మురిసిపోయాడు చంద్రశేఖరం. స్థిరపడి కొబ్బరినీరు తాగి గ్లాసు కింద వుంచాడు. ఇద్దర్నీ పరిశీలించాడు.

''యేదో మాట్లాడుకుంటున్నట్టున్నారే? అడ్డు వచ్చానా?''

''అబ్బేబ్బే. అదేం లేదు బావగారూ. వీడు బుర్రలేనట్టు వూకదంపు అనే టాపిక్ యెత్తితే!'' అని నవ్వసాగాడు నరహరి.

''నాకు ఆ టాపిక్ మీద బాగా మాట్లాడటం రాదని తటపటాయిస్తున్నాను. సమయానికి దేవుడు పంపినట్టు నిపుణులు మీరొచ్చారు. సీరియస్ పనిమీద వెళ్లారా? నెరవేరిందా? కాయా పండా?'' అని నవ్వుతూ అన్నాడు.

''నేనా? మా చెల్లి మనుమరాలి పెళ్లి మాటలు నలుగుతున్నాయని విని, యెంతవరకు వచ్చాయో తెలుసుకుందామని వెళ్లాను. మా బంధువుల పిల్లనే మరొక అమ్మాయిని అదే యింటి పేరుగల ఆ సంబంధం కావాలని చేసుకున్నవారికే, భూములూ రొఖ్ఖం దండిగా వున్నాయని, పెళ్లికొడుకు చిన్నవాడనీ, అప్పుడే వుద్యోగంలో చేరాడనీ స్థిరపరచి పెళ్లి చేసేశారు చౌకగా. చౌకగా అని యెందుకన్నానంటే పెళ్లికొడుక్కి పాతికేళ్లయినా లేకపోయినా, వాళ్ల వాళ్లు వూదరపెడుతూ, బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా పనికిరారు పెళ్లాడు అన్నారట. పిల్ల లేచిపోయే రకం గానీ, బియ్యమమ్ముకునే రకం గానీ వస్తుందేమోనని వెరుస్తున్నాడట పెళ్లికొడుకు. వాడి మిత్రులు ''యీ అమ్మాయి అలాంటిది గాదు. పదహారాళ్లే. టెన్త్ క్లాస్ మొన్ననే పాసైంది. తలొంచుకుని బడికెళ్లేది. తలొంచుకుని యింటికొచ్చేది. అది కాన్వెంటే. యెవరిళ్లలోనూ దూరదు. తెలుపు. నాజూకు. మీడియం హైటు'' అని నచ్చచెప్తే వారి మాటలమీద నమ్మకముంచి పెళ్లికి సిద్ధమై, పెళ్లిచూపులకి వెళ్లాడు. చూపులుకాగానే అక్కడే చెప్పేశాడట.

''పిల్ల నచ్చింది. వారెంత యిస్తే అంతే తీసుకుంటాను. బేరం పెట్టరాదు. మీ లాంఛనాల సంగతి మీరు మాట్లాడుకోండి. ఇట్ డజ్‌నాట్ కన్సర్న్ మి. ఫిక్స్ చేసేయండి'' అని లేచాడట.

ఇరువాగులవారూ హర్షించి పెళ్లి చేసేశారు. ఆ అబ్బాయి కింకా

తమ్ముళ్లున్నారు. ఒక్కొక్కరికీ పాతికేకరాలొస్తాయి. అందుకని మా చెల్లి మనుమరాలి నివ్వాలని ఆలోచిస్తుంటే, కూతురూ అల్లుడూ దేనికో సందేహిస్తూ గమ్మునున్నారని చూసి, మా బావ పూర్ణయ్య అంటే పెళ్లి కూతురి మాతామహుడు, 'నే వెళ్లి నచ్చచెప్పి సెటిల్ చేసుకొస్తా' నని చెప్పి విజయవాడ వెళ్లి పెళ్లివారితో సంప్రదింపులు జరిపాను.

''నిశ్చయమైందా?'' మురారి ఆదుర్దాగా అడిగాడు.

'' ఒకటే తొందరా? నింపాదిగా వినాలి'' అలా అంటూ పైపంచె తీసి చాపమీద పెట్టి కథనం సాగించాడు చంద్రశేఖరం. పిల్లవాడి తండ్రి యెంతో మర్యాదగా అన్నాడట. 'మీరు నాల్రోజుల ముందటే వచ్చి వుండాల్సింది పూర్ణయ్య గారూ! మాకెవరైతేనేమిటి? డబ్బు శాశ్వతమా! లక్షవచ్చుగాక పోవుగాక! అయినింటి పిల్లను తెచ్చుకోవాలి. మా అబ్బాయికి పిల్ల నచ్చాలి. నాల్రోజుల క్రితం, పరాయివారు శంకరం గారొచ్చి, కాళ్లు గడ్డాలు పట్టుకుని పెళ్లిచూపులకి రమ్మని రైలు ఛార్జీలిచ్చి మనిషిని పెట్టి వెళ్లారు. మర్యాద చెల్లించాలని రాజధాని వెళ్లాము. వేడుక ముచ్చటగా ముగియగానే, ముఖ్యాంశాలు చర్చించి, అందరికీ అన్నీ నచ్చినాయని పెద్దల యెదుట స్థిరపరచి, తాంబూలాలు పుచ్చుకున్నాము. మీరాలస్యంగా వచ్చారు' అని సాంత్వనంగా మాట్లాడి, భోజనం చేసి వెళ్లమని, బలవంతం చేసి, ఆ పని కాగానే తానే వచ్చి సెండాఫ్ యిచ్చాడు. నాకు కష్టమేసి వచ్చేస్తూ దోవలో మా వూళ్లో దిగి అంతా రాలిపోయేట్టున్నారని స్వంతమనుషుల్ని చూడవెళ్తే బంధువులు చూడవచ్చారు నన్ను. ''అన్నదమ్ములు కొట్లాడుకోరేమయ్యా? భాగాలూ పంచుకోరూ? సమిష్టి కుటుంబమనేది యేనాటి ఆచారం!' అని ముక్కుల మీద వేళ్లుంచుకున్నారు.

''కొట్లాడుకునే అవసరమేదండీ? కొద్ది భూమి యిల్లు మా అమ్మ పేరున్నాయి. ఆమె తదనంతరం యెలాగూ అవి మాకే చెందుతాయి. పెళ్లాలకి సందు యివ్వం. నోరెత్తి యేమి తెచ్చావూ? అనగానే నోరు మూతపడుతుంది. మా నాన్న పెట్టిందేదో తిని యింట్లో ఒక మూల పడుకుని కృష్ణారామా అనుకుంటాడు. ఇంతవరకూ అమ్మేపుడకేస్తున్నది. యెవరి సంపాదనవారిది. అంటే 'నిజమే నిజమే' అన్నారు. నేపోవాలి, నరహరీ, దీపాలు వెలిగాయి. దోవ బాగా కానరాటం లేదు' అని లేచాడు చంద్రశేఖరం. వుత్తరీయం కప్పుకుని వెళ్లిపోతున్న చంద్రశేఖరాన్ని చూస్తూ మురారి నవ్వుతూ అన్నాడు.

'' ఈ వూకదంపు వినడానికా చంద్రశేఖరంగార్నంతగా మర్యాద చేశావూ?''

''మరే. నువ్వూ ఆనందించావుగా?'' అన్నాడు నరహరి.